బిగిసిపోయి ఉంటుంది. ఆమె చూపులు గద్దచూపుల్లా ఎప్పుడూ ఆశ్రమవాసుల్లోని కుళ్ళుని వెతికి పట్టుకోవాలన్నట్టుగా ఉంటాయి. ఐదడుగుల ఏడు అంగుళాల ఎత్తూ, ఎత్తుకుతగ్గ లావూ ఆమెను చూడగానే ఆడో మగో పోల్చుకోవటం కష్టమే. మగవాడిలా గోచిపెట్టి మోకాళ్ళవరకే కట్టిన కాషాయరంగు ధోవతి–భుజాలమీదగా క్రాసులా వచ్చి నడుముకు చుట్టబడిన మరో అంగవస్త్రం– మడతలు పడి వేలాడుతున్న పొట్టమీదా, మెడమీదా, చేతి దండలకూ పులిమిన రక్తచందనం. ఇదీ ఆమె రూపం. ఆమెకు ఆ ఆశ్రమవాసులు చాటుగా పెట్టుకొన్న ముద్దుపేరు గంగానమ్మ.

గౌతమి ఆ యువతి రెక్క పట్టుకొని తీసుకొస్తున్నది. గువ్వను గండుపిల్లి నోట కరచుకొని వస్తున్నట్లుగా ఉంది ఆ దృశ్యం.

ఆశ్రమవాసు లందరూ బిగిసిపోయి కూర్చున్నారు. గౌతమి ఆ యువతిని స్వాములవారి పాదాలముందు పడేసింది. కీళ్ళు ఊడదీసిన బొమ్మలా స్వాములవారి పాదాలముందు కూలబడింది ఆ యువతి.

"స్వామీ! ఈ పాపిని శిక్షించండి. ఈ పవిత్రమైన ఆశ్రమ వాతావరణాన్ని కలషితం చేసిన పాపాత్మురాలు" గౌతమి కంఠం నగారామీద దెబ్బ పడినట్టుగా మోగింది.

'గౌతమీ! ఆగు! నువ్వు నీ గురుదేవుని జ్ఞానాన్నే శంకిస్తున్నావు' తీవ్రంగా పలికింది భైరవానందుని కంఠం.

"అయితే అసలు పాపి ఎవరు? ఎవరో చెప్పమనండి గురుదేవ్!" శిష్యుల కేకలు.

"నాయనలారా శాంతించండి. ఇలాంటి విషయాల్లో స్త్రీలు నిజం చెబుతారనుకోవడం మీ భ్రమ. ఆమెకు మీలో ఎవరిమీదైనా కోపం ఉందనుకోండి! అతడి పేరు అంటే మీలోని ఒకడి పేరు చెప్పొచ్చు. ఒక నిరపరాధిని దండించడం మహాపాపం! మరీ బలవంతం చేస్తే, ఈ నాగిని నా పేరు కూడా చెప్పవచ్చును."

'శివ శివా! మీ పేరు చెబుతుందా? ముక్కముక్కలుగా తరిగి పారేస్తాం!' అనేక కంఠాలు అరిచాయి ఆవేశంగా.

'ఇలాంటి విషయాల్లో పురుషుడు నామమాత్రంగానే ఉంటాడు. అపరాధం స్త్రీదే! స్త్రీని దండించాలి.'

'భైరవానందం! నీ అసలురూపం ఈ రోజు నాకు తెలిసింది. ఆ అమాయకురాలి ముఖంలోకి చూడు- సరిగ్గా చూసి చెప్పు- ఆమె పాపం చెయ్యగలదా?' శివానందం కంఠం గుడి గంటలా మోగింది.

"నోరు ముయ్! గురుదేవుల్ని ఏక వచనంతో పిలుస్తావా? సర్వసంగ పరిత్యాగుల్నే నిందిస్తావా?" గౌతమి అరిచింది.

